బిల్లులు రాక.. పనులు సాగక

- ఆగిన పంచాయతీ భవనాల నిర్మాణం
- నిధుల విడుదల కోసం ఎదురుచూపు

పెన్‌పహాడ్‌ : పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించడానికి గత ప్రభుత్వం శివారుల పల్లెలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఈ గ్రామాల్లో సరైన పాలనను సాగించడానికి గ్రామ పంచాయతీ భవనాలను సైతం మంజూరు చేసింది. అయితే ఈ భవనాల పనులను ప్రారంభించిన అప్పటి కాంట్రాక్టర్లు సమయానికి బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు. దీనికి తోడు సర్పంచ్‌ల పదవీకాలం సైతం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. ఈ క్రమంలో ఆగిపోయిన పంచాయతీ భవనాల నిర్మాణాలను పట్టించుకునే వారే లేరు.



రంగయ్యగూడెంలో నిధులు లేక నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

పెన్‌పహాడ్‌ మండలంలో ఇలా..

మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొత్తగా 12 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామ సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బంది ఉండకూడదని శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాల స్థానంలో, నూతన పంచాయతీల్లో కలిపి మొత్తం తొమ్మిది భవనాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20లక్షల నిధులు మంజూరు చేయించింది. తంగెళ్లగూడెం, చినసీతారాంతండా, గాజులమల్కాపురం, న్యూబంజారాహిల్స్‌ తండా, లింగాల గ్రామ పంచాయతీల్లో భవనాల నిర్మాణాలు పూర్తికాగా దోసపహాడ్‌, మేగ్యాతండా, చినగారకుంట తండా, రంగయ్యగూడెం గ్రామ పంచాయతీల భవనాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అయితే వీటికి ఇంత వరకు బిల్లులు రాలేదు. బిల్లులు రాకపోవడం, సర్పంచ్‌ల పదవి కాలం ముగియడం, ప్రభుత్వం మారడంతో భవనాల నిర్మాణ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు.

బిల్లులు చెల్లించాలి

మా ఊరును కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. చిన్న గ్రామమైనప్పటికీ అభివృద్ధిలో పోటీ పడి పనులు చేశాం. మా ఊరికి గ్రామ పంచాయతీ భవనం కావాలని తెచ్చుకొని పనులు పూర్తి చేయించాం. అయితే రూ.20లక్షలకు ఒక్క పైసా కూడా రాలేదు. ప్రభుత్వం స్పందించి పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించాలి.

– బాదె ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్‌, తంగెళ్లగూడెం

నిధులు లేక ఆగిన పనులు

మండలంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు నిధులు లేక ఆగిపోయాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు చేయాలని ఆదేశిస్తే గ్రామ పంచాయతీ భవనాల పనులు ప్రారంభమవుతాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడం, బిల్లులు రాకపోవడంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

– గోపి, పీఆర్‌, డీఈఈ

క్లుప్తంగా

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

నాగారం : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కడియం రామచంద్రయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ సభ్యత్వం ప్రతి రెండు సంవత్సరాలకు రద్దు అవుతుందని, ప్రతి ఒక్కరూ తిరిగి మళ్లీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యదర్శి కూరాకుల వెంకన్న, బీజేపీ మండల అధ్యక్షుడు మొలక్రపురి చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశగాని నర్సయ్య, మాజీ సర్పంచ్‌ కుంభం కర్ణాకర్‌, కొమిరెల్లి, వెంకన్న, ఎల్లాచారి, కిరణ్‌, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అర్వపల్లి : అర్వపల్లి పట్టణ వర్తక వ్యాపారుల సంఘం నూనత కమిటీని గురువారం స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిల్లంచర్ల విద్యాసాగర్‌, ఉపాధ్యక్షుడిగా కొప్పోజు సతీష్‌, ప్రధాన కార్యదర్శిగా మొరిశెట్టి ఎల్లేష్‌, కోశాధికారిగా బైరిక శ్రీనివాస్‌, సహాయ కార్యదర్శులుగా వనం రమేష్‌, ఈదురు వీరపాపయ్య, చింతలపాటి సుధాకర్‌, రాయవరపు గోపి, కోనేటి రాజారాం, ముఖ్య సలహాదారులుగా రాగి మహేష్‌, బౌరోజు శ్రవణ్‌, కనుకు నర్సయ్య, పోలోజు సోమయ్యతోపాటు మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కాగా నూతన కమిటీని కాంగ్రెస్‌ నాయకుడు బైరబోయిన మహరాజు సన్మానించి అభినందించారు.

మొబైల్‌ ఫోన్‌ అప్పగింత



పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడికి సెల్‌ఫోన్‌ అప్పగిస్తున్న ఎస్‌ఐ ఏడుకొండలు

తుంగతుర్తి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి గురువారం పోలీసులు అప్పగించారు. ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తుంగతుర్తికి చెందిన అలీ కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్‌ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్‌ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి సెల్‌ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అప్పజెప్పారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సోమ్లాతండాలో పరిసరాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి బాలు

మద్దిరాల : సీజనల్‌ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరి ధిలోని తూర్పుతండా, పీరియడ్‌ తండాలలో ఆయన పర్యటించి మాట్లాడారు. పరిశుభ్రత పాటించకుంటే డెంగీ, చికెన్‌ గున్యా, మలేరియా, టైఫాయిడ్‌వంటి వ్యాధులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తండావాసులు పాల్గొన్నారు.

నూతనకల్‌ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, రోగాల బారి నుంచి కాపాడుకోవా లని మండల ప్రత్యేక అధికారి డి.బాలు కోరారు. గురువారం నూతనకల్‌ మండల పరిధిలోని సోమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తండాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్‌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి.మల్లేష్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిడుగు రామమూర్తి జయంతి



రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు భాషా పరిరక్షణ సమితి సభ్యులు

సూర్యాపేటటౌన్‌ : తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ప్రభాకర్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మనం వికాస వేదిక అధ్యక్షుడు, సుధా బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ పెద్దిరెడ్డి గణేష్‌, విశ్రాంత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్‌, విశ్రాంత ఉపాధ్యాయుడు నాగవెల్లి కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ భాషలన్నింటిలో తెలుగు భాష మధురమైనదని, సుసంపన్నమైనదని అన్నారు. మన భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విద్యార్థులు పాడిన శతక పద్యాలు, కవితలు, దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు



కంప చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అర్వపల్లి : సీజనల్‌ వ్యాధుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్‌ కోరారు. గురువారం అర్వపల్లిలోని కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్‌లో పారిశుద్ధ్య పనులను చేయించారు. కేజీబీవీకి వెళ్లే దారివెంట ఉన్న కంపచెట్లను తొలగించారు. పాఠశాలల పరిసరాలను గ్రామపంచాయతీ సిబ్బందిచే శుభ్రం చేయించారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్ల వెంట, వీధులలో చెత్త వేయవద్దని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

సూర్యాపేటటౌన్‌ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌ లైన్‌ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ డిమాండ్‌ చేశారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్‌ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌లో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. మాస్‌లైన్‌ పార్టీ నాయకులు హాస్పిటల్‌ను సందర్శించి అక్కడున్న సమస్యలను పేషంట్లను, హాస్పిటల్‌ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారని తెలిపారు. హాస్పిటల్‌లో మందుల కొరత ఉందని, అదేవిధంగా కిడ్నీ, గ్యాస్ట్రో, గుండె, న్యూరో డాక్టర్లు లేరన్నారు. హాస్పిటల్‌కి కావాల్సిన వైద్యసిబ్బందిని నియమించాలని కోరారు. బయట ప్రైవేట్‌ హాస్పిటల్స్‌ నడిపిస్తూ ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందించని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌ కుమార్‌, చంద్రకళ, రేణుక, రామోజీ, వాజిద్‌ తదితరులు పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూ మహాసభల పోస్టర్‌ ఆవిష్కరణ

నూతనకల్‌ : ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర 7వ మహాసభలను ఈ నెల 31, సెప్టెంబర్‌ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సుజాత తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకులు ఆమని, కావ్య, కనకం వెంకటమ్మ, ఆకుల పుష్ప, నకిరేకంటి బిందు, ఉడుగుల సుత్తి, యశోద పాల్గొన్నారు.

అర్వపల్లి : హైదరాబాద్‌లో ఈ నెల 31, సెప్టెంబర్‌ 1, 2 తేదీల్లో జరిగే పీఓడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయాలని జాజిరెడ్డిగూడెంలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్‌ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు పోలెబోయిన సునీత, వడకాల ఐలమ్మ, పోలెబోయిన మంగమ్మ, సునీత, బాలమ్మ, ఉపేంద్ర పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- ఎమ్మెల్యే మందుల సామేల్‌

అర్వపల్లి : వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. గురువారం ఆయన అర్వపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఫీల్డ్‌కు వెళ్లిన సిబ్బందికి ఫోన్‌చేసి విధులకు వెళ్లారా లేదా అని ఆరాతీశారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. మందులు అందుబాటులో ఉన్నా యా, లేవా అని వైద్యసిబ్బందిని అడిగారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కోటాచలంకు ఫోన్‌చేసి విధులకు రానివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్‌ మాధవి, ఎంఎల్‌హెచ్‌పీ జి.వాణి, మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, బైరబోయిన మహరాజు తదితరులు పాల్గొన్నారు.



నాగారం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌



అర్వపల్లి పీహెచ్‌సీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌

నాగారం : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యలో పెంచాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచాలని అన్నారు. సీజనల్‌ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించారు. ఆయన తోపాటు స్టాఫ్‌నర్సు సుజాత, ల్యాబ్‌ టెక్నీషియన్‌ ప్రవీన్‌రెడ్డి, హెల్త్‌ అసిస్టెంట్‌ యాదగిరి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



తుంగతుర్తి : వెంపటిలో విద్యార్థులకు బహుమతిని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సామేల్‌

తుంగతుర్తి : పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మందుల సామేల్‌ అన్నారు. పానుగంటి సుమతీదేవి జ్ఞాపకార్థం, దాయం రాజిరెడ్డి చారిటబుల్‌ ట్రస్ట్‌ సౌజన్యంతో స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో వెంపటి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. మొదటగా జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాయం చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ దాయం ఝాన్సీ, ఎంఈఓ బోయిని లింగయ్య, డీసీసీబీ డైరెక్టర్‌ గుడిపాటి సైదులు, దాయం విక్రంరెడ్డి, నల్లు రామచంద్రారెడ్డి, దొంగరి గోవర్ధన్‌, నరేష్‌, తునికి సాయిలు, నాగయ్య, సత్యనారాయణ, యాకయ్య, దాసరి శ్రీను, శంకర్‌, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌, వెంకట్రామనర్సమ్మ, ప్రిన్సిపల్‌ ఉమారాణి, పీడీలు యాకయ్య, మల్లేష్‌, ఆయా పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలని వినతి



పెన్‌పహాడ్‌లో తహసీల్దార్‌ లాలుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



అర్వపల్లి తహసీల్దార్‌ కార్యాలయంలో..



నాగారంలో..

పెన్‌పహాడ్‌ : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ అమలులో అనేక నిబంధనలు విధించి రైతుల సంఖ్య కుదింపు చేయడం సరికాదన్నారు. రుణమాఫీ కాక కొందరు రైతులు, రుణమాఫీ అయ్యి తిరిగి రుణాలు మంజూరు కాక మరికొందరు రైతులు బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని అన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌ లాలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి, చినపంగి నర్సయ్య, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, మండల కమిటీ సభ్యులు నెమ్మాది లక్ష్మి, గుంజా వెంకటేశ్వర్లు, లక్కపాక ముత్తయ్య, జిల్లా నాయకులు కోడి ఎల్లయ్య, అంజిమళ్ల సైదులు, ఉపేందర్‌, రామలింగయ్య, పుల్లయ్య, వెంకన్న, సోములు, వేసు, శ్రీరాములు, సైదులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మాఫీ చేయాలని ఆమ్‌ ఆద్మీ పార్టీ సూర్యాపేట జిల్లా అధికార ప్రతినిధి దుంపల మురళి రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది రైతులకు నేటికీ రుణాలు మాఫీ కాలేదని తెలిపారు. రేషన్‌ కార్డు, ఆధార్‌ కార్డు పేరుతో వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.

అర్వపల్లి : ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీని అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. రుణమాఫీ అమలులో తెల్లరేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలని, రూ.2లక్షల పైనున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. అలాగే గోదావరి జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. ధర్నా అనంతరం సీనియర్‌ అసిస్టెంట్‌ జలంధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్‌, చెరుకు ఏకలక్ష్మి, ఎల్లంల అవిలయ్య, కొప్పోజు సరోజ, శిగ వెంకన్న, శ్రీను, అబ్బులు, సంపతి వెంకన్న, శిగ శ్రీకాంత్‌, వెంకటేష్‌, కృష్ణయ్య, భద్రయ్య, సుధాకర్‌ పాల్గొన్నారు.



మద్దిరాలలో..



నూతనకల్‌ : ధర్నాలో పాల్గొన్న నాయకులు

అర్హులైన రైతులందరికీ మాఫీ చేయాలి

నాగారం : అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బ్యాంకర్లు కూడా రైతుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రుణమాఫీ అవుతుందో లేదో అని రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య, సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్‌, మండల కమిటీ సభ్యులు భిక్షం, ఎల్లమ్మ, మల్లమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్‌ : రుణమాఫీ కాని రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలను గందరగోళ పరిస్థితికి తెచ్చిందన్నారు. మంత్రులు ఇచ్చే ప్రకటనలో స్పష్టమైన వైఖరి లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల జనార్దన్‌, బొజ్జ శ్రీనివాస్‌, అంజపల్లి లక్ష్మయ్య, కూసు సైదులు, సామ వెంకట్‌రెడ్డి, దాసరి వీరన్న, అనంతుల రాఘవులు, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, కాముని పరమేష్‌ పాల్గొన్నారు.

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి డిమాండ్‌ చేశారు. గురువారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రభుత్వం కేవలం 40 శాతం మందికి మాత్రమే అమలు చేసిందని అన్నారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కల్లేపల్లి భాస్కర్‌, సీపీఎం మండల నాయకులు పోలోజు సైదులు, పాతూరు మల్లారెడ్డి, చిదిరాల నారాయణ, మోష, వీరయ్య, కొంపెల్లి నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో అలసత్వం

- సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌ కుమార్‌



మాట్లాడుతున్న డేవిడ్‌ కుమార్‌

ఆత్మకూర్‌ (ఎస్‌) : కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఎన్నికల హామీలను అమలుచేయడంలో అలసత్వం వహిస్తోందని సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌ కుమార్‌ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కొన్ని గ్యారంటీలను అరకొరగా అమలు చేస్తూ ప్రభుత్వం కాలం వెల్లదీస్తోందన్నారు. కూలీలకు రూ.12వేల గ్యారంటీని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. మహిళలకు రూ.2500 హామీ అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీవైఎల్‌ జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య, పీవైఎల్‌ జిల్లా కోశాధికారి బండి రవి, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లె వెంకన్న, సామ నర్సిరెడ్డి, ఏఐకేఎంఎస్‌ నాయకులు దేగల వెంకటకృష్ణ, కొండేటి సంజీవరెడ్డి, బత్తిని ఎల్లయ్య, రవి, గోపాల్‌, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌, సైబర్‌ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీందర్‌

పెన్‌పహాడ్‌ : డ్రగ్స్‌, సైబర్‌ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రవీందర్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాల, కళాశాలలో సైబర్‌ నేరాలు, గంజాయి, డ్రగ్స్‌పై పోలీసు కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్‌ మోసాలకు గురి కావద్దని, బ్యాంక్‌ ఖాతా, ఏటీఎం కార్డ్‌ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలుపవద్దని సూచించారు. యువత లోన్‌ యాప్‌లకు దూరంగా ఉండాలని అన్నారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డులు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపల్‌ ఎస్‌కే సలీం, అమర్‌కుమార్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ మురళీధర్‌రెడ్డి, కానిస్టేబుల్‌ బాలకృష్ణ, శ్రీనివాస్‌, కళాబృందం ఇన్‌చార్జ్‌ యల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతు కుటుంబాల గుర్తింపు



నాగారం : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి గణేష్‌ ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతు కుటుంబాల గుర్తింపు సర్వే నిర్వహించారు. రుణమాఫీ వర్తించని రైతులు అందుబాటులో ఉండి వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రైతు కుటుంబాల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నేరెళ్ల సత్యం, రైతులు శ్రీరాములు, యల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో రుణమాఫీ కాని రైతు కుటుంబాల నిర్ధారణ కోసం వ్యవసాయ శాఖ అధికారులు గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పి.కృష్ణకాంత్‌ మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి సీఎల్‌డబ్ల్యూ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ కాని రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్‌లు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ ఫారం నింపి మండల వ్యవసాయశాఖ అధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్వేత, శ్రీను, రైతులు యారాల రాంరెడ్డి, బెల్లి సైదులు, ప్రశాంత్‌, శ్రీను, సైదులు, లలిత పాల్గొన్నారు.

జేవీవీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

సూర్యాపేటటౌన్‌ : ఈ నెల 31న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించే జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్‌ బి. శ్రీనివాసరాజు, జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌ బాబు పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల సన్నాహక కార్యక్రమం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక ఫలాలను సామాన్యులకు చేరవేసే సదుద్దేశంతో జన విజ్ఞాన వేదిక పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో వైజ్ఞానిక స్పృహను నింపుతూ ఎప్పటికప్పుడు సామాజిక చైతన్యాన్ని కలిగించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్‌ జేవీవీ నాయకులు తల్లాడ రామచంద్రయ్య, వల్లపట్ల దయానంద్‌, మారం నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు యాదగిరి, సోమ సురేష్‌ కుమార్‌, గోపయ్య, జానయ్య, అనిత పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో సంబరాలు

అర్వపల్లి: మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌ రావడాన్ని హర్షిస్తూ జాజిరెడ్డిగూడెంలో గురువారం రాత్రి బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో బాణ సంచాలు కాల్చి సంబరాలు చేశారు. ఈ సంద్భంగా పార్టీ నాయకులు మాట్లాడారు. బెయిల్‌ విషయమై సుప్రీం కోర్టునే తప్పు పట్టే పద్ధతుల్లో కొంతమంది మాట్లాడటం తగదన్నారు. ప్రజలు ఊహించినట్లుగానే కవిత కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా నాయకుడు మోరిశెట్టి ఉపేందర్‌, పార్టీ నాయకులు పాల్గొన్నారు.